www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025

గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ ద్వారా ఎంపిక చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు లాటరీ ద్వారా పారదర్శకంగా దుకాణాలను కేటాయించారు. జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణాలకు 294 దరఖాస్తులు వచ్చాయి. మద్యం షాపు దక్కించుకున్న దరఖాస్తుదారుడు వెంటనే ఆరోజు లైసెన్స్ రూ.5,41,667 లేదా రూ.4,58,333 మొదటి విడతగా చెల్లించి ప్రయోజనాలు లైసెన్స్ పొందాలి. గురువారం కల్లుగీత కార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణా కేటాయింపునకు నాన్ రిఫండబుల్ కింద రూ.5.80 కోట్ల ఆదాయం సమకూర్చడంలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ఆరో స్థానంలో నిలిచింది. 14 షాపుల కేటాయింపునకు లైసెన్స్ ఫీజు కింద గురువారం రూ.72.50 లక్షల ఆదాయం లభించింది.

బాలుడి 'డెత్' మిస్టరీ..?

సిసిఎస్ పోలీసులే కొట్టి చంపారంటున్న తల్లిదండ్రులు, బంధువులు
చోరీ కేసులో తీసుకెళ్లి శవంగా పంపారంటూ ఆరోపణలు
ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన
అనుమానాలకు తావిస్తున్న బాలుడి ఒంటిపై దెబ్బలు
నోరువిప్పని పోలీసులు
పోస్టుమార్టం పూర్తి, మృతదేహం అప్పగింత
ఎఫ్ఐఆర్‌లో మరోలా నమోదు..

ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, స్పోర్ట్స్

ఏలూరులోని చేపలతూము సెంటర్‌కు చెందిన ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన మైనర్ బాలుడి డెత్ మిస్టరీ పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. ద్విచక్ర వాహనాల చోరీ కేసులో విచారణకు తీసుకెళ్లిన బాలుడు శవంగా ఎలా మారాడన్న ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. పోలీసులు కొట్టిన దెబ్బలకే అతను చనిపోయాడంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విచారణపేరుతో రోజుల తరబడి పోలీసులు అతన్ని ఎందుకు బంధించారు. తమ కుమారుడిని చూపించాలంటూ తల్లిదండ్రులు వేడుకున్నా ఎందుకు చూపించలేదన్న ప్రశ్నలకు సమాధానాలు లేకుండా పోయాయి. బాలుడి మృతి మిస్టరీపై పోలీసుల మౌనం మరిన్ని అనుమానాలకు తావిస్తూ, జనాల్లో చర్చనీయాంశంగా మారింది.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో పోలీసులు తీసుకువెళ్లిన ఏలూరు చేపల తూం సెంటర్ రెల్లిపేటకు చెందిన బంగారు యశ్వంత్(17) అనే బాలుడు అనుమానస్పదంగా మృతి చెందడం గురువారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. తమ కుమారుడిని పోలీసులే చంపారంటూ తల్లిదండ్రులు బంధువుల ఆరోపిస్తే ఏలూరు సర్వజన ఆసుపత్రి వద్ద ఆందోళన దిగిన పరిస్థితి నెలకొంది. బాలుడి డెత్ మిస్టరీలో పోలీసులపై ఆరోపణలు రావడంతో విచారణ జరుగుతుందా లేదా అన్న అనుమానాలు నెలకొన్నాయి. తల్లిదండ్రులు బంగారు శివ, వనిత, బంధువుల కథనం ప్రకారం.. మృతుడు బంగారు యశ్వంత్ పదో తరగతి చదువుతున్నాడు. త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంది. నాలుగు రోజుల క్రితం రాత్రిపూట ఇంటికి పోలీసులు వచ్చి తమ మనవడు యశ్వంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు నాయనమ్మ చెబుతోంది. ద్విచక్రవాహనాల చోరీ కేసులో అతనిని తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారని చెబుతోంది. అతనితోపాటు మరో ముగ్గురిని సైతం పోలీసులు తీసుకెళ్లిన్నట్లు చెబుతున్నారు. ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారో తెలిక తర్వాత రోజు తల్లిదండ్రులు, బంధువులు అన్ని పోలీస్‌స్టేషన్లు తిరగ్గా చివరికి సిసిఎస్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు తమకు సమాచారం తెలిసిందన్నారు. అక్కడకు వెళ్లి ఆరా తీస్తే మీ కుమారుడికి ఏమీ కాదని విచారణ చేసి తర్వాత పంపిస్తామని, భోజనం పెడతామని, రిమాండ్ చేస్తామని, పోలీసులు తెలిపారని తల్లి చెబుతోంది. మూడు రోజుల తర్వాత గురువారం ఉదయం ఆసుపత్రికి తమ కుమారుడు శవంగా ఎలా వచ్చాడో చెప్పాలంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ మనుమడు ఆసుపత్రిలో చనిపోయి ఉన్నట్లు కొందరు గుర్తించి తమకు సమాచారం అందించారని వెంటనే తాము ఆసుపత్రికి వచ్చి చూసుకోగా అక్కడ తమ మనవడు మతి చెంది ఉన్నాడని వారు కన్నీరుమున్నీరయ్యారు. సిసిఎస్ పోలీసులే తనకుమారుడిని చంపేశారంటూ యశ్వంత్ తండ్రి శివ ఆరోపిస్తున్నారు. సిసిఎస్ పోలీస్ స్టేషన్లో ఉండాల్సిన తమ కుమారుడు ఆసుపత్రిలోకి ఎలా వచ్చాడో.. ఎలా చనిపోయి పడి ఉన్నాడో చెప్పాలంటూ ఆసుపత్రి బయట బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. తమ కుమారుడు ఎక్కడ ఉన్నాడో ఒక్కసారి చూపించాలని బతిమాలినా చూపించలేదంటూ తల్లి వనిత కన్నీరుమున్నీరుగా విలపించడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేసింది. తమకు న్యాయం జరిగే వరకూ తాము పోరాటం చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని మతుడి తండ్రి శివ తెలిపారు. ప్రస్తుతం కుమారుడు ఒంటిపై ఉన్న దెబ్బలే అతని పోలీసులు చంపారు అనడానికి నిదర్శనమని కూడా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకూ పోలీసులు ఈ ఘటనపై స్పందించకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. పెదవేగి మండల పరిధిలోని పంటకాలువ దగ్గర బాలుడి మృతదేహం ఉందని తొలుత గుర్తించెవరు? అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఎవరు తరలించారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసిందెవరు? అన్న సందేహాలకు మాత్రం సమాధానం దొరకడం లేదు. బాలుడి మృతికి సంబంధించి ప్రతి అంశం మిస్టరీగా కనిపించడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. ముందు పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని పంపిచేస్తారంటూ ప్రచారం సాగినప్పటికీ సాయంత్రం ఆరుగంటలకు బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

మృతుడు యశ్వంత్

జిల్లా కలెక్టర్ వద్ద కన్నీరుమున్నీరు

బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించడానికి సర్వజన ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వద్దకు వెళ్లిన బాలుడి తల్లిదండ్రులు, బంధువులు తమ కుమారుడిని పోలీసులు చంపేశారంటూ ఘొల్లుమన్న పరిస్థితి నెలకొంది. దీనిపై విచారణ చేయిస్తానని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

సాయంత్రానికి ఎఫ్ఐఆర్ నమోదు

బాలుడు యశ్వంత్ మృతికి సంబంధించి పెదవేగి పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలవరం కాలువ గట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లి స్పృహతప్పి పడిపోయినట్లుగా చూసినవారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారని, గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినట్లు, గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బాలుడి అన్న బంగారు కృష్ణవర్ధన్ పెదవేగి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చేసినట్లు తెలిసింది. ఉదయం ఆసుపత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులు, బంధువులు మాట్లాడినదానికి, సాయంత్రం ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పొంతన లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీని వెనుక ఏదో జరిగిందన్న బలమైన అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బాలుడి మృతి మిస్టరీ తేలుస్తారో లేదో చూడాల్సి ఉంది.

తప్పు చేసిన వారిని శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులకు ప్రాణాలకు ముప్పుతెచ్చే హక్కులేదని, తప్పు చేసిన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ బిడ్డను పోలీసులే చంపేశారంటూ ఏలూరులోని తంగేళ్లమూడిలో నివాసముంటున్న యశ్వంత్ కుటుంబసభ్యులు పోలీసులపై ఆరోపణ చేస్తున్నారని తెలిపారు. ఒకవేళ యశ్వంత్ మృతికి పోలీసులే కారణమైతే అది చాలా బాధాకరమని, పోలీస్ ఉన్నతాధికారులు ఈ ఘటనపై సమగ్రవిచారణ జరిపించి అందుకు కారకులైన పోలీస్ సిబ్బందిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంగారు యశ్వంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం, ఏలూరు సిసిఎస్ పోలీసులు వల్లే తమ కుమారుడు మృతి చెందాడని ఆరోపిస్తూ జిల్లా ప్రభుత్వాస్పత్రి వద్ద బంధువులు ఆందోళన చేయడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంపై ఆయన స్పందించారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో మృతుడు యశ్వంత్‌ను మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్న సిసిఎస్ పోలీసులు కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి చిత్రహింసలకు గురిచేశారని బాధిత బంధువులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు దాడి చేయడం వల్లే తన కుమారుడు మృతి చెందాడని తల్లి రోదించడం వంటి దృశ్యాలు బాధాకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా పోలీసులు తమ పరిధిలో పరిశోధన చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేయడం, చావుకు కారకులు కావడం తగదని హితవుపలికారు.

యశ్వంత్ మృతిపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన బంగారు యశ్వంత్ అనే మైనర్ బాలుడుని ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో సిసిఎస్ పోలీసులు అదుపులోకి తీసుకొని 3రోజులపాటు తల్లిదండ్రులకు వారి కొడుకును చూపమన్నా చూపించకుండా నేడు శవాన్ని పోస్ట్ మార్టానికి పంపించిన సంఘటనపై జిల్లా కలెక్టర్ న్యాయ విచారణకు ఆదేశించి తగిన న్యాయం చేయాలని సిపిఎం పార్టీ ఏలూరు నగర నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. దొంగతనం కేసులో రోజుల తరబడి విచారణ పేరుతో పోలీస్ స్టేషన్ లో ఉంచుకొని, ప్రాణాలు కోల్పోవడంపై న్యాయ విచారణకాదేశించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. పదో తరగతి చదివే మైనర్ బాలుడు మతి చెందిన ఘటనపై విచారణ జరిపి నిజా నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వ్యవహరిస్తున్నట్లుగా ఈ సంఘటన తెలియజేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

పోలవరం ఏటిగట్టు సెంటర్లో మానవహారం నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా కార్యకర్తల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం

సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మానవహారం

ప్రజాశక్తి - పోలవరం

రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. విజయవాడలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఆశాలను వెళ్లనీయకుండా ఎక్కడకక్కడ గృహ నిర్బంధం, మార్గం మధ్యలో అడ్డుకోవడం ప్రభుత్వ దుర్మార్గపు చర్య అని విమర్శించారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ గురువారం ఏటిగట్టు సెంటర్ వద్ద ఆశా కార్యకర్తలు మానవహారం చేపట్టారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ కుసుమ, సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడారు. ఆశాలను ధర్నాకు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకోవడం ప్రభుత్వానికి సరైంది కాదన్నారు. ఆశాలకు ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వేతనంతో కూడిన మెటర్నటి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వయోపరిమితి 62కు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్, మట్టిఖర్చులు, కమ్యూనిటీ హెల్త్వర్కర్స్ ని ఆశావర్కర్స్ గామార్పు చేయాలని తదితర ఒప్పందాలను అమలు కోసం ప్రభుత్వం జిఒలు విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు నానాటికీ తగ్గుతున్నాయన్నారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ అధ్యక్షులు పి.వెంకటలక్ష్మి, కార్యదర్శి బి.నాగలక్ష్మి, జయలక్ష్మి, శ్యామలత, చెల్లారత్నం, వీరమణి, దుర్గ, సునీత, విజయకుమారి, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు తామ బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.సాయికృష్ణ పలువురు పాల్గొన్నారు.

నిడమర్రు : చలో విజయవాడకు ఆశాలు వెళ్లకుండా కార్యక్రమాన్ని అడ్డుకుంటూ పోలీసులు నిర్బంధం విధించడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు ఖండించారు. అలాగే సిఐటియు మండల కమిటీ నాయకులు కె.వరప్రసాద్. కమిలి నాని, సోడాబత్తుల శ్రీనివాస్, గోక సూరిబాబు, పిల్ల హరికుమారి, నిమ్మల పార్వతి ఎస్‌కె.రబియా, కోన జయమ్మ నిర్బంధాన్ని ఖండించారు.

కలిదిండి: తమ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ తరలి వెళ్తున్న మండలంలోని ఆశా కార్యకర్తలను పోలీసులు గుడివాడలో అడ్డగించి, టూ టౌన్ పోలీస్ స్టేషన్ కి తరలించినట్లు ఆశా కార్యకర్తలు తెలిపారు. స్టేషన్ ఎదుట తమ నిరసన వ్యక్తం చేశారు. అరెస్టయిన వారిలో ఆశా కార్యకర్తలు దుగ్గిరాల అరుణాదేవి, అంద్రాజు విమల, నంద్యాల సువర్ణ, పుట్టి రామ లక్ష్మి, బస్వాని మహేశ్వరి, వేములవాడ నాగమణి, బందెల వనిత, వి వరలక్ష్మి తదితరులున్నారు.

కదంతొక్కిన కోకో రైతులు

సమస్యలు పరిష్కారం కోరుతూ
కలెక్టరేట్ వద్ద మహాధర్నా
కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు, రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో గింజల కొనుగోలు సమస్యపై ఏలూరులో కోకో రైతులు కదం తొక్కారు. కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా కోకో గింజలు, కోకో కాయలతో ఏలూరు కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహించి, వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కంపెనీలు సిండికేట్‌గా మారి కోకో రైతులకు ధర తగ్గించి నష్టం కలిగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కోకో రైతుల నినాదాలతో కలెక్టరేట్ ఆవరణం దద్దరిల్లింది. తమను ఆదుకోవాలంటూ కలెక్టరేట్ నుంచి ఫైర్ స్టేషన్ మీదుగా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకుని మహాధర్నా కొనసాగించారు. కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ముందుగా మహాధర్నాను ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కిలోకు రూ.900 ధర కల్పించి కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 50 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ అంతర పంటగా కోకో సాగు జరుగుతుందని, జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక కోకో పంట విస్తీర్ణం ఉందన్నారు. కోకో రైతుల కొనుగోలు సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కొనుగోలు కంపెనీలతో రైతుల సమక్షంలో ప్రభుత్వం చర్చలు జరిపి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కోకో రైతుల సమస్యలపై ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, ఎస్.గోపాలకృష్ణ, జె.కాశీబాబు, ఎల్.గోపాలరావు, పి.అచ్యుతరామయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, విజయరాయి ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు ఎం.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో గింజలకు రూ.900 వరకు ధర ఉన్నా ప్రస్తుతం కోకో గింజలు కొనుగోలు కంపెనీలు ఆ ధర చెల్లించడం లేదని చెప్పారు. పాత, కొత్త గింజల పేరుతో కోకో రైతులను కంపెనీలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు లేనివిధంగా గ్రేడింగ్ విధానం తీసుకొచ్చి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, ఉద్యాన శాఖాధికారులు, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రైతుల వద్ద ఉన్న కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలోకు రూ.900 ధర ఇచ్చి కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి కోకో రైతుల సంఘం నాయకులు, కోకో రైతులు వినతిపత్రం అందించారు. కోకో రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రైతులతో కొంతసేపు చర్చలు జరిపి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన శాఖ కమిషనర్, ప్రభుత్వం దృష్టికి కోకో రైతుల సమస్యలు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలతో వెంటనే సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆమె చెప్పారు. కోకో గింజల కొనుగోలు సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని చెప్పారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌కు కోకో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు త్రీ టౌన్ సిఐ కోకో రైతుల పట్ల దురుసుగా వ్యవహరించడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం, కొబ్బరి రైతుల సంఘం నాయకులు గుదిబండి రమేష్ రెడ్డి, కోనేరు సతీష్, నరసింహారావు, లోకేష్, బి.సుబ్బారావు, బొబ్బా రమేష్, వి.రాంబాబు, జి.శ్రీనివాస్, ఎం.నరేంద్ర, పి.కృష్ణ, ఎస్.రాంబాబు, వి.నాగరాజు, ఎం.శాంతరాజు, ఎం.సత్యనారాయణ, ఎన్.లక్ష్మణరావు పాల్గొన్నారు. జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఎన్‌టిఆర్, కృష్ణా, తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కోకో రైతులు తరలివచ్చారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ఆగిఉన్న లారీని ఢీకొన్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు
నలుగురు మృతి
మరో 21 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు సమీపంలో గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నగర శివారు జాతీయ రహదారి చొదిమెళ్ల బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న సిమెంటు లారీని ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో సహా నలుగురు మృతి చెందగా మరో 21 మంది గాయాలపాలయ్యారు. దీంతో క్షతగాత్రులను హైవే అంబులెన్సు పోలీసులు 108 వాహనాల్లో స్థానిక సర్వజన ఆసుత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రమణ ట్రావెల్స్ బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి కాకినాడకు బయలుదేరింది. బస్సులో 40 మంది ప్రయాణికులున్నారు. గురువారం తెల్లవారు జామున ఏలూరు సమీపానికి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బస్సు దూసుకుంటూ ముందుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ క్రమంలో బస్సు ఎడమ వైపు భాగమంతా నుజ్జునుజ్జు అయ్యింది. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన బొంతు భీమేశ్వరరావు (43), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాత్రవారిపల్లికి చెందిన యువతి మట్టపర్తి భవానీ (23), కోనసీమ జిల్లా, కోలంక గ్రామ పంచాయతీ ఇంజిరమ్‌కు చెందిన జుత్తిగ భవానీ (28) ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బస్సు డ్రైవరు మధు (నాని) (28) పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఈ ప్రమాదంలో గాయపడిన వివిధ ప్రాంతాలకు కోలా సురేఖా, కోలా రాజా బాబు, కోలా నిఖిత, ఆదిలక్ష్మి, మద్దాల కీర్తి, మాచెర్ల సుజాత, మండపాక బాలాజీ, మండపాక హరిణి, మండపాక శశిరేఖ, శ్రీలక్ష్మి, కోట వేణి, పువ్వుల శ్యాముకుమార్, శీలం ప్రకాశ్, ఎం.ప్రతాప్, అక్కమ్మ, హేమలత, విజయకుమార్, ఆర్.సత్యనారాయణ, టి.రవికుమార్, బస్సు క్లీనర్ జి.మణికంత చికిత్స పొందుతున్నారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేట్టారు.

అతి వేగం వల్లే..

మాచర్ల సుజాత, ప్రయాణికురాలు

డ్రైవర్ బస్సును ముందుగా మెల్లగా నడిపి ఒక్కసారిగా స్పీడు పెంచాడు. దీంతో ఎదురుగా ఆగిఉన్న లారీని బస్సు ఢీకొట్టి పల్టీ కొట్టింది. అంతవరకే నాకు గుర్తుంది. నేను బస్సు నుండి బయటకు వచ్చే సమయం వరకూ తరువాత విషయాలు గుర్తు లేవు. డ్రైవర్ వేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగింది.

నుజ్జునుజ్జయిన బస్సు, లారీ వెనుక భాగం

క్షతగాత్రులకు కలెక్టర్ పరామర్శ

క్షతగాత్రులను పరామర్శిస్తున్న కలెక్టర్

ఏలూరుసిటీ: బస్సు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం పరామర్శించారు. ఈ ఘటనపై కలెక్టర్ వెట్రిసెల్వి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న వైనంపై ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని జిజిహెచ్ వైద్యులను ఆదేశించారు. ఈ విషయంపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారు. విజయవాడ నుండి రాజమండ్రి వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ రిపేరు వచ్చి రోడ్డుపై ఆగిపోయింది. అయితే హైదరాబాద్ నుంచి కాకినాడకు సుమారు 30 మంది ప్రయాణికులతో వస్తున్న రమణ ట్రావెల్స్ బస్సు ఆగిఉన్న లారీని వెనుక నుంచి అతివేగంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బొంది భీమేశ్వరరావు, మట్టపర్తి భవానీ, జుత్తిగ భవానీ, బస్సు డ్రైవర్ మధు మరణించాడు. మిగిలిన 21 మందిలో మగవారు 12 (పిల్లలు ముగ్గురు), మహిళలు 9 మందికి స్వల్ప గాయాలు కావడంతో ఏలూరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

మంత్రులు, ఎంపీ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాద ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు.

అతివేగం వల్లే ప్రమాదం..

ప్రయాణికులు తెలుపుతున్న వివరాలు ప్రకారం.. ప్రమాదానికి 15 నిమిషాల ముందు నుంచి బస్సు అతివేగంగా ప్రయాణిస్తోందని, బస్సు ప్రయాణిస్తున్నప్పుడు సీట్ల నుంచి పైకి కిందకి పలుమార్లు ఎగిరామని తెలిపారు. కళ్లు మూసి తెరిచేలోపు బస్సు లారీని ఢీకొని పలుమార్లు పల్టీ కొట్టిందని తెలిపారు.

భీమడోలు : చొదిమెళ్ల వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురిలో ఒకరు బొంతు భీమేశ్వరరావు (43) భీమడోలు వాసి. అతను గుర్రాల చెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా పెయింటర్. ఆయనకు భార్యతో పాటు ఇంటర్ చదువుతున్న కుమారుడు, 9వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. అయితే పెయింటింగ్ పని కోసం భీమేశ్వరరావు హైదరాబాదు వెళ్లారు. తిరిగి బుధవారం రాత్రి హైదరాబాదు నుంచి రమణ ట్రావెల్స్ బస్సులో భీమడోలు బయలుదేరారు. బస్సు ఏలూరు సమీపిస్తున్న నేపథ్యంలో భీమడోలులో దిగేందుకు అంతవరకూ వెనుక సీట్లో కూర్చున్న భీమేశ్వరరావు ముందుకు వచ్చినట్లు ఇతర ప్రయాణికులు తెలిపారు. ఇంతలోనే జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమేశ్వరరావు చనిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బిల్డింగుగూడెంలో విషాదం

చేపల వేట కోసం వెళ్లి అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

చేపల వేట కోసం వెళ్లిన అన్నదమ్ములు ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని తుమ్మగూడెంలోని బిల్డింగుగూడెం దళితవాడలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మగూడెం గ్రామంలోని బిల్డింగుగూడెం దళితవాడకు చెందిన అన్నదమ్ములు మోలుగుమాటి చంద్రశేఖర్(30), మోలుగు మాటి విజయ్‌కుమార్(27) మరొక ముగ్గురితో కలిసి గురువారం మధ్యాహ్నం జయపురం గ్రామంలో చెరువు వద్దకు చేపలు వేట కోసం వెళ్లారు. ఇద్దరు అన్నదమ్ములు చెరువులోకి దిగి వలలతో చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా చెరువులో ఉన్న పెద్ద గొయ్యిలో విజయ్‌కుమార్ పడిపోవడంతో తమ్ముడిను రక్షించే ప్రయత్నంలో చంద్రశేఖర్ కూడా ఆ గోతిలో పడిపోయాడు. ఇద్దరూ ఊబిలో కూరుకుపోయారు. స్థానికులు వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ డి.రామకృష్ణ తన సిబ్బందితో చెరువు వద్దకు చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మోలుగుమటి నాగేశ్వరరావుకు ముగ్గురు కుమారులు కాగా ఇద్దరు కుమారులు మృతి చెందడంతో కుటుంబసభ్యులు గుండెలాలిసెలా రోదించారు. మృతులిద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్నపిల్లలు ఉన్నారు. అన్నదమ్ముల మృతితో బిల్డింగుగూడెం దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - దెందులూరు

జిల్లాలో తాగు, సాగు నీటికి ఎటువంటి సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. దెందులూరు మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు సమీపంలోని ఏలూరు నగరానికి సాగునీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, మత్స్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దెందులూరు కాలిబాట వంతెన వద్ద ఏలూరు కాల్వలో తూడు తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన సాగునీరు అందించడంతో పాటు ఏలూరు నగర ప్రజలకు తాగునీరు సరఫరాచేసే విషయంలో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ఏలూరు కాలువ ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నీటితో నింపేందుకు అవసరమైన పర్యవేక్షణ కూడా చేయాలన్నారు. వేసవిలో తాగునీటికి ఎటువంటి సమస్య లేకుండా చూడాలన్నారు. చేపల చెరువులకు అక్రమంగా నీటి మళ్లింపు లేకుండా ఏలూరు కాలువకు సంబంధించి జిల్లా పరిధిలోని 30 కిలోమీటర్ల మేర ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, తహశీల్దార్లు కాలువ గట్ల వెంబడి క్షేత్రస్థాయిలో పర్యటించి నిఘా ఉంచాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, వ్యవసాయ, మత్స్యశాఖాధి కారులతో కూడిన బందాలు గట్టినిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలోని మంచినీటి చెరువులను కాల్వలను మూసివేసేలోగా పూర్తిస్థాయిలో నింపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు కాలువ ద్వారా సాగు, తాగునీరు అందించే అంశంపై వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.నాగార్జునరావు మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం ఈ నెల 11వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామని, తిరిగి మార్చి 25 నుంచి ఏప్రిల్ 25వ తేదీ వరకు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. అనంతరం వాటర్ పంప్ హౌస్ వద్ద కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలు నాటారు. కలెక్టర్‌తో పాటు ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌భాషా, జిల్లా మత్స్యశాఖ జెడి నాగలింగాచార్యులు, ఇంజినీర్లు పి.సుబ్రహ్మణేశ్వరరావు, ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, తహశీల్దార్లు సుమతి, రమాదేవి, పూర్ణ, శ్రీనివాస్, నీటిపారుదల సంఘాల ఛైర్మన్ వెలమటి రామచంద్రప్రసాద్, సాగునీటి సంఘాల అధ్యక్షులు నెరుసు వెంకటరమణ, మాజీ సర్పంచి లుకలాపు సత్యనారాయణ, సాగునీటి సంఘం సభ్యులు బోసి ఎఫ్రాయిమ్, స్థానిక రైతులు ఉన్నారు.

8న సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా మహిళా సాంస్కృతిక సమ్మేళనం జయప్రదం చేయాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీలు కోరాయి. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో కార్యక్రమం బ్రోచర్‌ను, ఫ్లెక్సీలను కమిటీ ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ పి.కస్తూరిబాయి, టీచర్ ఎం.సుకన్య, మానవత ఏలూరు మండలం కార్యదర్శి వి.సాయి సుధ, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వై.నిర్మల, రిటైర్డ్ సంఘం నాయకులు జివి.రావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, కె.శ్రావణికుమారి, కె.జనని, ట్యూషన్ సెంటర్స్ టీచర్స్ సిహెచ్.యాని, గంగాభవాని, మానస, సంధ్య, మంజూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవం, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమంలో మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమిదో తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు రామకృష్ణపురంలోని సాహిత్య మండలి భవనంలో మహిళలకు ప్రతిభా పోటీలు, చైతన్య సదస్సు, శ్రామిక మహిళలకు సత్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు పి.కస్తూరిబాయి అధ్యక్షత వహిస్తారని ఎ.ఎస్తేరుకళ్యాణి (రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్), డిఎన్ఎస్ చంద్రావతి (లెక్చరర్), హేలాపురి బాలోత్సవం ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, దేవరకొండ సుశీల వక్తలుగా పాల్గొంటారన్నారు. వివిధ రంగాలకు చెందిన అల్లూరి మోహిని, జి.నీలిమ, వి.సాయిసుధ, కె.శ్రావణికుమారి, ఎం.సుకన్య, ఎం.లక్ష్మి, కె.జననిలు నిర్వాహక కమిటీగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పి.కస్తూరిబాయి మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తితో మహిళలకు ప్రతిభాపాటవ పోటీలు, అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా బెస్ట్ ఫ్రం వేస్ట్, పేపర్ క్రాఫ్ట్, అంతర్జాలంలో అన్వేషణ, సామెతలు, మహిళా అభ్యుదయ పాటలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అంశంలో బెస్ట్ మూడు చొప్పున బహుమతులుగా మెడల్, మెమెంటో, రాజ్యాంగం బుక్, మహిళా దినోత్సవ స్పెషల్ బుక్, ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. వి.సాయిసుధ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా వేద రంగాల్లో సమాజానికి సేవ చేస్తున్న ఎంపిక చేసిన శ్రామిక మహిళలకు అభినందన సత్కారం చేస్తామని తెలిపారు.


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ద్వారకాతిరుమల ఎంఇఒ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవలను క్రమబద్ధీకరించాలని, సమగ్ర శిక్షా ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఎంటిఎస్, సమ్మె కాలపు ఒప్పందాలు, గ్రాడ్యూటీ, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కెఎస్.రఘురామ్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

చిన్నతనం నుంచి పట్టుదలతో చదివి 27 ఏళ్ల వయస్సులోనే పిహెచ్‌డి సాధించిన గన్నెన కెఎస్.రఘురామ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని యర్రమిల్లిపాడు గ్రామస్తులు కొనియాడారు. ఆ గ్రామానికి చెందిన నెక్కంటి నాగేశ్వరరావు పద్మావతి మనవడు రఘురామ్ బెంగుళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)లో పిహెచ్‌డి చేశారు. 2015లో గురుఘాసిదాస్ విశ్వ విద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. అనంతరం ఎంటెక్ పూర్తిచేసి బెంగుళూరులో పాలిమర్ బిందువు బాష్పీభవనం, బబుల్ న్యూక్లియేషన్ మెకానిజం అంశంలో పై చేసిన పరిశోధనకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వారు డాక్టరేట్ ప్రదానం చేయడం సంతోషంగా ఉందని రఘురామ్ తల్లిదండ్రులు గన్నెన రాధాకృష్ణ, ఉమా తెలిపారు.

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - కుక్కునూరు

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కుక్కునూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ అవగాహనా సదస్సు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ సునీత విద్యార్థులకు 100, 112 కాల్ ఒక్క ఉపయోగాలు విద్యార్థులకు వివరించారు. కానిస్టేబుల్స్ రామకృష్ణ, దుర్గారావు పోలీస్ స్టేషన్ విధి విధానాలు, రికార్డులు, లాకప్, రిసెప్షన్ కౌంటర్, వైర్లెస్ సెట్ ఎలా వాడాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బీమాశేఖర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా సేవలందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సేవలందించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన గురువారం ముసునూరు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.రాజకుమార్‌ను పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు, రైతులకు త్వరితగతిన సేవలందించాలన్నారు. అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నేరాలు - ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న పాఠశాల బస్సు

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బైక్‌ను పాఠశాల బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మండలంలోని లక్ష్మీపురం సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను గురువారం ఉదయం జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ పాఠశాలకు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఐఎస్ జగన్నాథపురం గ్రామం నుంచి చీపురుగూడెం గ్రామానికి కూలి పనులకు వెళ్తున్న గౌతు సత్యనారాయణ, మానెల్లి ముక్కయ్య తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జీలుగుమిల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల వివరాలు సేకరించారు.

పామాయిల్ తోట దగ్ధం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గుర్తు తెలీని వ్యక్తులు అడవికి నిప్పంటించడంతో అది కాస్త పక్కనే ఉన్న పామాయిల్ తోటకు అంటుకోవడంతో పామాయిల్ తోట దగ్ధమైన ఘటన మండలంలోని పాకలగూడెంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఆకతాయిలు అడవికి నిప్పంటించడంతో అది కాస్త పక్కనే ఉన్న సరియం ముత్యాలరావుకు చెందిన ఐదు ఎకరాల పామాయిల్ తోటకు అంటుకొని కొంతమేర దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే తోట దగ్ధం కావడంతో నష్టపోయామని రైతు బోరున విలపిస్తున్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని హెచ్‌పి గ్యాస్ గోడౌన్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సంతకు లారీలో ఎనిమిది ఆవులు, 75 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. లారీని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఊరి బడికి ఉరి..!

ప్రత్యామ్నాయం పేరుతో భారీగా తరగతులు విలీనం
తూతూ మంత్రంగా ఎస్ఎంసి తీర్మానాలు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే దిశగానే అడుగులు వేస్తున్నాయి. ఎన్ఇపి 2020లో భాగంగా దేశంలో ఇప్పటివరకు ఏ ఒక్క రాష్ట్రం కూడా నూతన విద్యా విధానాన్ని అమలు పరచలేదు. అయితే గత వైసిపి ప్రభుత్వం మాత్రం నూతన విద్యావిధానాన్ని వడివడిగా అమలుపరిచింది. దీంతో ఆరు అంకెల విద్యా విధానం అమల్లోకి వచ్చింది. అందుకు అనుగుణంగా జిఒ 117 ద్వారా ఒక్క కిలోమీటర్ లోపు ఉన్నత పాఠశాలలు ఉంటే 3, 4, 5 తరగతులు ప్రాథమిక పాఠశాలల నుంచి తరలించారు. దీంతో అనేక పాఠశాలలు 1, 2 తరగతులకు పరిమితమై భారీగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఏర్పడ్డాయి. మరోవైపు ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలల్లోకి వెళ్లిన విద్యార్థులకు అక్కడ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో వారు ప్రయివేట్ పాఠశాలల్లో చేరాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో జిఒ నెంబర్ 117తోనే ప్రభుత్వ పాఠశాలలు 30 శాతంపైగానే డ్యామేజీ అయ్యాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గత ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో భాగంగా జిఒ నెంబర్ 117ను రద్దు చేస్తామని బేషరతుగా హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. అయితే జిఒ నెంబర్ 117 రద్దుకు ప్రత్యామ్నాయం తీసుకున్న ఐదు అంకెల విద్యా విధానం ప్రభుత్వ పాఠశాలలను మరింత అఘాతంలోకి నెట్టేస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పేరుకే ఐదు అంకెలు కాని అంతర్గత సమావేశాల్లో మాత్రం మోడల్ ప్రైమరీ స్కూలు లేదా ఫౌండేషన్ పాఠశాలలు మాత్రమే ఉండేలా చూడాలని స్పష్టంగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

మోడల్ పాఠశాలలు పేరుతో..

పంచాయతీకొక మోడల్ పాఠశాల ఏర్పాటు చేయమని తెలిపి అందులో 60 మంది విద్యార్థులు ఉండాలని అప్పుడే తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే ఇక్కడ తరగతికి ఒక ఉపాధ్యాయుడు అనే అంశం బాగానే ఉన్నప్పటికీ సమీపంలోని పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థుల తరలింపు అనేది ఎలా సాధ్యపడుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నెలకొన్న ఈ గజిబిజి గందరగోళంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని తమ విద్యార్థులను ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించేశారని, ఇలాంటప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఎలా ఉంటారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీంతో మోడల్ ప్రైమరీ పేరుతో పాఠశాలలు భారీగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారనున్నాయని ఉపాధ్యాయ సంఘాలు తెలుపుతున్నాయి.

తూతూ మంత్రంగా ఎస్ఎంసి తీర్మానాలు

పక్క పాఠశాలల్లో తరగతుల తరలింపుపై ఎస్ఎంసి తీర్మానాలు చేయాలని ఉందని అధికారులు తెలియజేసినప్పటికీ అంతర్గతంగా వాటిని ఎలాగైనా ఒప్పించండని తీర్మానంగానే తీసుకోవాలని తెలపడంతో ప్రధానోపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు అయితే అసలు పూర్తిగా మూసివేస్తామని తెలపడంతో ఒకేసారి 6, 7, 8 తరగతుల విద్యార్థులు దూర ప్రాంతాలకు సుమారు మూడు కిలోమీటర్ల పైబడి ఉన్న పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్ఎల ఆమోదం తప్పనిసరి

ముందుగా తరగతుల తరలింపు, నూతన విద్యా విధానం అమలు కోసం సంబంధిత విద్యాశాఖాధికారులు స్థానిక ఎంఎల్ఎ ఆమోదం తప్పనిసరని తెలిపారు. అయితే కొంతమంది అధికారులు ఎంఎల్ఎల వద్దకు వెళ్లని పరిస్థితి. ఏది ఏమైనా ఈ ఐదు అంకెల విద్యా విధానంతో ఉపాధ్యాయుల సర్ ప్లస్‌తో పాటు సమీప భవిష్యత్తులో అనేక పాఠశాలలు మూతపడనున్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పున:పరిశీలించి పాత విద్యావిధానమే అమలు చేస్తే బాగుంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూతన విద్యా విధానంలో జిల్లా వ్యాప్తంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలు 298 ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలు అసలు ఇక ఉండవు. అప్‌గ్రేడ్ అయ్యే యుపి పాఠశాలలు పది, ఎల్‌కెజీ, యుకెజీ, ఒకటి, రెండు తరగతులు ఫౌండేషన్ పాఠశాలలు 218. ప్రైమరీ పాఠశాలలు 843 ఉన్నాయి.

ఇంటర్ పరీక్షకు 187 మంది హాజరు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక అల్లూరి సీతారామరాజు జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర గణితం, బోటని, సివిక్స్ పరీక్షకు 187 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని రెండు ప్రభుత్వ, ఒక ప్రయివేట్ కళాశాల నుంచి 199 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వారిలో 12 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం, బోటని, సివిక్స్ పరీక్షకు 94 శాతం విద్యార్థులు హాజరై, పరీక్షలు రాసినట్లు నంబూరి గోపాలకృష్ణంరాజు తెలిపారు.

ఈదులగూడెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఇటీవల నూజివీడులో జరిగిన సబ్‌జోన్ ఆటల పోటీల్లో మండల పరిధిలోని ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు తాడి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను, వారికి శిక్షణా ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పక్షుల దాహార్తిని తీర్చేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పక్షుల దాహార్తి తీర్చడానికి ప్రజలందరూ కృషి చేయాలని పర్యావరణ పరిరక్షకుడు, వన సంరక్షణ సమితి సభ్యులు, రాణా వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో బండివారిగూడెంలో ఉపయోగంలో లేని వస్తువులతో పలు ప్రదేశాల్లో నీరు నింపి పక్షుల దాహార్తి తీర్చుతున్నారు. ఈ విధంగా పక్షులకు, మూగ జీవాలకు దాహార్తిని తీరుస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ రాణా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంక సాంబశివ రాయల్ స్ఫూర్తితో స్వచ్ఛందంగా మూగ జీవాల ప్రాణాలను కాపాడుతూ పక్షుల దాహార్తి తీరుస్తున్నామని ఆయన తెలిపారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని బర్రింకలపాడులో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా అనారోగ్యానికి గురై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న 70 మందికి మంజూరైన రూ.12 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ బడుగు బలహీన తరగతులకు చెందిన వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

ప్రజాశక్తి - దెందులూరు

స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, కొన్ని రోజుల క్రితం అందరూ కలిసి గెట్ టుగెదర్ అయ్యారు. హాజరైన విద్యార్థులందరూ పాఠశాల అవసరాలకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. విద్యార్థులందరూ కలిసి పాఠశాలకు ఒక మైక్‌సెట్‌ను, రెండు బాక్స్‌లను, రెండు కార్డు లెస్ ఫోన్లను సుమారు రూ.30 వేలతో కొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.మల్లికార్జునరావుకు అందించారు.

ప్రజల దాహార్తిని తీర్చాలి : సిపిఐ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రజల దాహార్తిని తీర్చాలని సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గవరవరం గ్రామపంచాయతీ పరిధి వెంకయ్యపాలెం గ్రామ శివారులో ఉన్న కాలనీవాసులు తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆంజనేయరాజు కాలనీ ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యను తెలుసుకున్నారు. కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా సరిగ్గా జరగడంలేదని, వేసవికాలం పూర్తిగా రాకమునుపే ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తాగునీటి కొరత లేకుండా చూసి ప్రజల దాహార్తిని తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జగదాంబ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి జగదాంబ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక జగదాంబ అమ్మవారి 68వ ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్ఎగా గెలిచిన తర్వాత మొదటిసారి తన సొంత మండలంలో జరిగే ఉత్సవాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.

పలుచోట్ల మహిళా దినోత్సవ వారోత్సవాలు

ప్రజాశక్తి - ముసునూరు

బాల్య వివాహాలపై ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు జెడ్‌పి స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో మహిళా హౌస్‌కీపింగ్, మహిళ భద్రతా సిబ్బందికి, మహిళా అధ్యాపకులకు బుధవారం రాత్రి ఆటల పోటీలు నిర్వహించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, టీమ్ స్టూడెంట్ మిత్ర కలిసి ఈ ఆటలపోటీలు నిర్వహించారు.

జాన్ భార్య స్వాతికి ఉద్యోగం ఇవ్వాలి

రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - కామవరపుకోట

విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యమే షిఫ్ట్ ఆపరేటర్ గుండుబోయిన జాన్ మృతికి కారణమని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాన్ భార్య స్వాతికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు. మండలంలోని పాత గండిగూడేనికి చెందిన గుండుబోయిన జాన్‌కు, స్వాతికి గత నెల ఒకటో తేదీన వివాహమైందని తెలిపారు. ఎల్‌సి తీసుకుని విద్యుత్ స్తంభం ఎక్కాక సిగ్నల్ వచ్చేవరకూ ఉండకుండా అధికారులు విద్యుత్ సరఫరా ఇవ్వడంతో విద్యుదాఘాతంతో జాన్ మృతి చెందాడని పేర్కొన్నారు. జాన్ మృతికి విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలి పారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, జాన్ భార్య స్వాతికి ఉద్యోగం ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

ఆర్‌టిసి అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఏలూరు-ద్వారకాతిరుమల బస్సు ప్రారంభించిన ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆర్‌టిసిని లాభాల బాటలో పయనింపచేసేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. అదే ఆలోచనతో ఆర్‌టిసిలో వివిధ నామినేటెడ్ పదవులను భర్తీ చేసినట్లు తెలిపారు. ఏలూరు నుంచి ద్వారకాతిరుమల కొండపైకి వయా వెంకట కృష్ణాపురం మీదుగా నూతన పల్లెవెలుగు బస్సు సర్వీసును ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. ఏలూరులోని కొత్త బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో రిబ్బన్ కట్ చేసి సర్వీసును ప్రారంభించిన అనంతరం ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉండేలా ఇప్పటికే అనేక నూతన బస్సులు, స్లీపర్ కోచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఆగిపోయిన ఏలూరు నుంచి వెంకటకృష్ణాపురం మీదుగా ద్వారకాతిరుమల సర్వీసును తిరిగి పునరుద్ధరించామన్నారు. ఆర్‌టిసి జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి సేవలు ఎంతో కీలకంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఎఎంటి జి.మురళి, ఎంఎఫ్ఐ ప్రేమ్ కుమార్, బస్టాండ్ ఇన్‌ఛార్జి కుమారి, పిఆర్ఒ నరసింహం, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

అంగన్‌వాడీల వేతనాలు పెంపు, గ్రాడ్యూటీ అమలు, మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని మార్చి పదో తేదీన విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాకు అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎఐటియుసి జిల్లా నాయకులు కారం దారయ్య పిలుపునిచ్చారు. కుక్కునూరు మండల కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని మాయమాటలతో మోసం చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోయారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విజయవాడ మహాధర్నాకు అంగన్‌వాడీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ పిఒ కృష్ణకుమారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కుక్కునూరు మండల కన్వీనర్ కొన్నె లక్ష్మయ్య, అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు వెంకటేశ్వరి, చందా రమాదేవి, కుంజా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తహశీల్దార్ సుభానితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అసంపూర్ణంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మండల పరిషత్ నిధులతో మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో పెయ్యేరు వైస్ సర్పంచి దివి సతీష్, ఆర్ఐ రాజశేఖర్, గంట కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇద్దరు నిరుపేదల అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆర్థిక సాయం ప్రకటించారు. మండలంలోని దాకారంలో ఒంటరిగా నివాసం ఉంటున్నకాటే రాజమ్మ(90) మృతి చెందింది. అదేవిధంగా మండలంలోని వడాలికి చెందిన మాదే సోమేశ్వరరావు(35) అనే వ్యక్తి గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వారి అంత్యక్రియలకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున వైష్ణవి రూ.పది వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. నగదు రూ.పది వేలు ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా మృతుల కుటుంబ సభ్యులకు గురువారం అందించారు.

రూ.పది వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని భూదేవిపేటలోని మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న కె.లక్ష్మీనరసింహ, తన గైడ్ టీచర్ ఎస్.యువరత్నకిషోర్ నాయక్ (ఎస్‌జిటి) మార్గనిర్దేశంలో గ్రామీణ జీవన శైలిని ఆధునీకరించే ఉద్దేశంతో సౌరశక్తితో నడిచే ఈవీ ఎడ్లబండి రూపకల్పన చేశారు. సౌర శక్తితో నడిచే ఈవీ ఎడ్ల బండి తయారు చేసేందుకు భూదేవిపేట విద్యార్థికి రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. ఈ ఇన్‌స్పైర్ మనక్ అవార్డును దేశీయ, రాష్ట్ర స్థాయి శాస్త్రవేత్తలు, విద్యా నిపుణుల సమితి అందిస్తున్నారు. ఈసారి ప్రాజెక్టుకు రూ.పది వేల సాయం అందించారు.

చిగుళ్ల సంరక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - దెందులూరు

చిగుళ్లు బలంగా ఉంటే పలు వ్యాధులు సంభవించవని దెందులూరు సిహెచ్‌సి డెంటల్ డాక్టర్ అరవింద అన్నారు. దెందులూరు సిహెచ్‌సిలో జాతీయ డెంటిస్ట్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రతిరోజు రెండుసార్లు ఉదయం, సాయంత్రం సాఫ్ట్ బ్రష్‌తో పళ్ల తోముకోవాలన్నారు. పచ్చి కూరగాయలు గుడ్లు, తృణధాన్యాలు మాంసకృతులు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి సమీప దంత వైద్యులకు విధిగా చూపించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిహెచ్‌సిలో ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం దంత వైద్య పరీక్షలు చేస్తున్నామని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో వరసిద్ధి వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణపవరం రోడ్డులో చలి వేంద్రాన్ని సర్పంచి డిడ్ల అలకనంద గురువారం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రయాణికులు, బాటసారుల కోసం చలివేంద్రం నిర్వహిస్తున్న ఆటో యూనియన్‌ను పంచాయతీ పాలకవర్గం అభినందించారు.

11న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 11వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సుబ్బారాయుడు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కూనపాముల విగ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **RYALI ALIVELU MANGA CHAYA DEVI,** W/o R. VENKATA SIVARAMA KRISHNA PRASAD, resident of Door.No. 3-120, Sivalayam Street, Sivadevunichikkala, Palakol Mandal, West Godavari District. A.P., changed my name **RYALI MANGA DEVI,** (Old Name) to **RYALI ALIVELU MANGA CHAYA DEVI,** (New Name). Hence after all my documents, Passport ete., will continue with my new Name **RYALI ALIVELU MANGA CHAYA DEVI.**

పాస్‌పోర్ట్ పోయినది

కోనకళ్ల వెంకట కృష్ణ, తండ్రి: వెంకటేశ్వర్లు, డోర్ నెం. 16-27, రేలంగి, గమళ్ళపాడు, ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 23-10-2022న **పాస్‌పోర్ట్ నెం. K8543238.** పాస్‌పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసుకొని ది. 22-02-2025 తేదీన పాలకొల్లు మండలం, చింతపర్రులోని మా చిన్నమ్మ వద్దకు పాస్‌పోర్ట్ గురించి మాట్లాడటానికి వెళ్లినపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ జెరాక్స్ తీయడానికి వెళ్ళగా నేను వైజాగ్‌లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెంబర్: 80088 28994

మహారాజశ్రీ 7వ అడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జి ప॥గో॥జిల్లా, ఏలూరు

ఎ.ఎస్.నెం. 72/2022

బిట్వీన్ :

మాదేటి వెంకట దుర్గా ఆనందరావు ...**అప్పీలెంటు**

మరియు

సమయమంతుల ముత్యాలరావు వగైరాలు

...రెస్పాండెంట్లు

పై నెంబరు గల అప్పీలు లో 5వ రెస్పాండెంటు అయిన సమయమంతుల సాంబశివరావు, S/o మల్లికార్జునరావు, CA, F-C-16 భరణి కాంప్లెక్స్, యన్.ఆర్.టి. స్టాట్యూట్ దగ్గర, మినిస్టర్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం వారికి పై కోర్టులో **ది. 26-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా కాని, లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని యెడల సదరు అప్పీలు తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్సు, ఏలూరు
ఏలూరు జిల్లా

ఏలూరు
ది. 04-03-2025

గ్రామపంచాయతీ కార్యాలయము, అయిభీమవరం

టెండరు ప్రకటన **తేది.06-03-2025**

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, అయిభీమవరం గ్రామపంచాయతీకి అవసరమైన కాంట్రాక్ట్ సిబ్బంది 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 12-03-2025వ తేదీ గురువారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 2.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 100/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పని పేరు	సంఖ్య	ధరావత్తు
1	పారిశుద్ధ్యం నిర్వహణ (1) గ్రిన్ అంబాసిడర్స్ (3)	04	ఒక్కొక్కరికి రూ 100/-
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ (మోటర్ స్విచ్ ఆపరేటర్ మరియు పైప్ లైను రిపైర్ మరియు ఓ.హెచ్.ఎస్.ఆర్.లు శుభ్రపరుచుటకు మరియు క్లోరినేషన్)	02	
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01	

టెండర్ దరఖాస్తు ఫారం మరియు టెండర్ దాఖలు చేయుటకు గానూ నియమావళి మరియు ఇతర విషయము కొరకు ఆఫీస్ పనిచేయు వేళలలో సంబందిత పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.
నిధుల లభ్యతను బట్టి వేతనాలు చెల్లింపబడును.

సం/- **ఎమ్.పి.ఎన్. ప్రసాద్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, అయిభీమవరం, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.

గ్రామపంచాయతీ కార్యాలయము, చినకాపవరం

టెండరు ప్రకటన **తేది.06-03-2025**

పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు మండలం, చినకాపవరం గ్రామపంచాయతీకి అవసరమైన కాంట్రాక్ట్ సిబ్బంది 2025-26 సంవత్సరమునకు ఈక్రింది వివరించిన ప్రకారము ది. 01-04-2025వ తేదీ నుండి ది. 31-03-2026 సంవత్సరము వరకు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను ది. 13-03-2025వ తేదీ శుక్రవారం ఉదయం గం. 11.00 గ॥ల నుండి మధ్యాహ్నం 1.00 గం॥ల వరకు స్వీకరించబడి, అదే రోజు మధ్యాహ్నం 2.00 గం॥లకు టెండర్లదారుల సమక్షంలో తెరవబడును. గాన ఆసక్తి గలవారు సదరు టెండర్లు వేసుకొని పోస్టు ఒక్కంటికి రూ. 100/-లు ధరావత్తు చెల్లించి సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. మిగిలిన వివరములు షరతులు కార్యాలయము పనిచేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం.	పని పేరు	కావలిసిన వ్యక్తుల సంఖ్య
1	పారిశుద్ధ్యం నిర్వహణ (1) గ్రిన్ అంబాసిడర్స్ (2)	03
2	రక్షిత మంచినీటి సరఫరా పథకము నిర్వహణ PWS స్కీం పంపు ఆపరేటర్ మరియు ఆర్.హెచ్.ఎస్.ఓ.లు శుభ్రపరుచుటకు మరియు క్లోరినైజేషన్ పైప్ లైన్ రిపేర్ నిమిత్తం	03
3	వీధి దీపములు పనుల నిర్వహణ	01

టెండర్ దరఖాస్తు ఫారం మరియు టెండర్ దాఖలు చేయుటకు గానూ నియమావళి మరియు ఇతర విషయము కొరకు ఆఫీస్ పనిచేయు వేళలలో సంబందిత పంచాయితీ కార్యదర్శి గ్రామపంచాయితీ వారి నుండి పూర్తి వివరములు పొందగలరు.
నిధుల లభ్యతను బట్టి వేతనాలు చెల్లింపబడును.

సం/- **ఎమ్.పి.ఎన్. ప్రసాద్**
గ్రామపంచాయితీ కార్యదర్శి, చినకాపవరం, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా.